క్లుప్తంగా

ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా చూడండి



తెనాలి అర్బన్: రంజాన్ ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. చెంచుపేటలోని ఈద్గాను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అక్కడ చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈద్గా ప్రతినిధులతో మాట్లాడి పురపాలక సంఘం తరఫున అందించాల్సిన సహాయ సహకారాలపై చర్చించారు. మున్సిపల్ అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో శాంతి ర్యాలీ

తెనాలి అర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా తెనాలి పరిధిలోని వివిధ పాస్టర్ల అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగనుంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బుర్రిపాలెంరోడ్డులోని ఎస్ భవన్‌లో సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో 200 మందికి బీపీ, షుగరు, బీఎంఐలతోపాటు అవసరమైనవారికి ఈసీజీ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. 20 మంది వలంటీర్లు సహకరించారు.

తెలుగు భాషపై చిన్నారులకు పరీక్ష



తెనాలి: ఉగాది పర్వదినం సందర్భంగా మడుపల్లి వెంకటేశ్వర్లు–రంగనాయకమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం తెలుగు భాషపై పరీక్ష నిర్వహించారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 5, 6 తరగతులకు చెందిన 50 మంది బాలబాలికలు హాజరయ్యారు. అనంతరం తొలి ముగ్గురు విజేతలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి బహూకరించారు. మరో పదిమందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మడుపల్లి శ్రీనివాస్–పద్మజలు బహుమతులను అందజేయగా, అతిథులుగా కూరపాటి రవీంద్ర, కళ్యాణి దంపతులు, ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్మీనారాయణ, లలితా గ్రూప్ సభ్యులు హాజరయ్యారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలి టౌన్: శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య ఆధ్వర్యంలో స్థానిక నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేశారు. కేంద్రం సభ్యులు యడ్ల వెంకటకృష్ణ, మంజుషాల కుమారుడు, కుమార్తె పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విధాన్స్ శ్రీ సత్య, విశ్వజ్ఞ శ్రీ సత్య, వి.గోపాలరావు, దీక్షిత, అనూష, ఆశ్రమ నిర్వాహకులు మురళి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు



తెనాలి టౌన్ : స్థానిక వహాబ్ రోడ్డు ఉప్పుబజార్ చివర రోడ్డుకు ఇరువైపులా పది రోజులుగా మురుగునీరు ప్రవహిస్తోంది. వ్యాపార సముదాయాల నిర్వాహకులు దుర్వాసనతో అల్లాడుతున్నారు. శానిటేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఉగాది పురస్కారాలు ప్రదానం



స్వరలయ సంస్థ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలతో బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు



సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానం

తెనాలి: కళలు వర్ధిల్లిన చోట శాంతి, సంతోషం వికసిస్తాయని ఏపీజేఏసీ ప్రతినిధి బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులను సత్కరించుకోవటం సముచితమని అన్నారు. పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో రజతోత్సవ ఉగాది వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో దైవాల వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 26 ఏళ్లుగా స్వరలయ సంస్థ చేస్తున్న సేవను అభినందించారు. విశిష్ట అతిథి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులను గౌరవించడం సంస్థ సముచిత సంస్కారానికి నిదర్శనమన్నారు. సభలో ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఈదర వెంకట పూర్ణచంద్ (సేవారంగం), గాయనీమణి కొండపి వసుంధర (సంగీతం) అధ్యాపకురాలు డాక్టర్ దాసరి విజయలక్ష్మి (పరిశోధన రంగం), ప్రముఖ రంగస్థల నటి షేక్ తిరుమలబీ (కళారంగం), నృత్యగురువు వసంతదుర్గ (నృత్యం) పురస్కారాలను స్వీకరించారు. స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు స్వాగతం పలికారు. 'ఉపన్యాస భూషణ' గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ ఉగాది పర్వదిన విశిష్టతను వివరించారు. పిరమిడ్ యోగ సాధకుడు డాక్టర్ జాస్తి వెంకట సుబ్బారావు ధ్యానం ప్రయోజనాలను వివరించారు. తొలుత ప్రముఖ గాయనీమణి ఆకెళ్ల హిమబిందు ప్రార్థనాగీతం ఆలపించగా, శ్రీకళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీకి చెందిన చలమలశెట్టి మహతి కూచిపూడి నృత్యాంశానికి ప్రశంసలు లభించాయి. రావిపాటి ప్రేమ్‌కుమార్ సభా నిర్వహణ చేశారు. మల్లేశ్వరరావు, పరాశరం రామగోపాల్, మణికంఠ, కళాభిమానులు పాల్గొన్నారు.

సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పాలపర్తి శ్రీకాంత్‌శర్మ

స్థానిక గంగానమ్మపేటలోని శిశి వేదికలో శనివారం సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. శిశి గ్రూప్ సంస్థల చైర్మన్ వుప్పల వరదరాజులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ ఉప్పలపు పవని ప్రియాంక, శ్రీశైల భక్త సేవా సమితి అధ్యక్షులు ఆళ్ల వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్ గంజి శివ భుజంగ ప్రభాకర్ రావు, కైలాసగిరి క్షేత్ర నిర్వాహకులు శ్రీకాకొలను లక్ష్మీనారాయణ గుప్తా, ప్రముఖ కూచిపూడి నర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య, బీజేయూ సభ్యుడు ఓ.మార్కండేయులు పురస్కారాలను స్వీకరించారు. సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి రమేష్ పర్యవేక్షించారు.

బ్రాహ్మణ పరిషత్ ఉగాది వేడుకలు

తెనాలి: తెనాలి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో తొలుత శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందంచే అన్నమయ్య సంకీర్తనల గానాలాపన జరిగింది. కొండపి వసుంధర శిష్యులు పలు కీర్తనలను గానం చేశారు. జోతిష్య శాస్త్రవేత్త పాలపర్తి శ్రీకాంత్ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు కోటా పార్థసారథి, కోశాధికారి రామరాజుగడ్డ శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యక్షుడు కాజా శ్రీనివాసరావు, పులిపాక లక్ష్మణ్‌కుమార్, సహాయ కార్యదర్శి మన్నవ మురళీధర్, సభ్యులు జూపూడి ప్రవీణ్‌కుమార్, కొండపి శ్రీనివాసరావు, భీమరాజు సురేష్, మోదుకూరు వేణుగోపాల్, మారేపల్లి సుబ్రహ్మణ్యం, మద్దూరి శ్రీనివాసరావు, మౌనిక, సరళ పాల్గొన్నారు. ఉచిత పంచాంగాలను పంపిణీ చేశారు. పరిషత్ కార్యదర్శి చింతపల్లి సాయికిరణ్ పర్యవేక్షించారు.



శ్రీకృష్ణ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సిద్ధాంతి మోదుకూరు రాధాకృష్ణశర్మ

శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

తెనాలిటౌన్: ఉగాది పండుగ సందర్భంగా స్థానిక నాజర్‌పేటలోని గోశాల వద్ద గల శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం అర్చకులు ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉగాది పంచాంగ శ్రవణం

తెనాలి టౌన్: స్థానిక పినపాడులోని తెలుగు సాహితీ సౌరభమ్ కార్యాలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం పంచాంగ శ్రవణం వీనుల విందుగా నిర్వహించారు. ప్రముఖ సిద్ధాంతి, కవి మోదుకూరు రాధాకృష్ణశర్మ రాశి ఫలాలు వివరించారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'కళారత్న' పురస్కారాన్ని సీఎం చంద్రబాబు నుంచి ఆదివారం అందుకుంటున్న తెనాలికి చెందిన ప్రముఖ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ చిత్రకారుడు రాయన గిరిధర్‌గౌడ్‌లు – తెనాలి

వడ్డీ రాయితీకి నేడు తుది గడువు



తెనాలి అర్బన్: పట్టణంలోని ఇంటి, నీటి, ఖాళీ స్థల పన్నుల చెల్లింపులపై వడ్డీ రాయితీ సోమవారంతో ముగియనున్నట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆది, సోమవారాల్లో పండుగలు వచ్చినప్పటికీ పన్నుల చెల్లింపు కేంద్రాలు తెరిచి ఉంచామన్నారు. మున్సిపల్ కార్యాలయం, పట్టణంలోని ఐదు తాత్కాలిక కేంద్రాలు కూడా పని చేస్తున్నాయని చెప్పారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



తెనాలి అర్బన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ఇమ్మానే మజ్లిస్ కమిటీ ఆధ్వర్యంలో నందులపేటలో పేద ముస్లింలకు తోఫాను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్, కమిటీ సభ్యులు షేక్ సత్తార్, బిస్మిలా ఖాన్, సయ్యద్ సుభాని, షేక్ మున్నీర్, షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ రోషన్, అబ్దుల్ సమాద్, షేక్ నాగూర్, షేక్ సమీర్, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

తాడేపల్లి రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఉండవల్లి అంబేడ్కర్ నగర్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం క్రైస్తవ సంఘాలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాయి. అంబేద్కర్ నగర్ నుంచి ఉండవల్లి కూడలి వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతితో క్రైస్తవులు ఆందోళన చెందుతున్నారని, మత సామరస్యం కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి లూథరన్ చర్చి పాస్టర్ రెవ.విజయరావు, పాస్టర్ క్రాంతి కుమార్, రాయపూడి కిరణ్, జ్యోతిబసు, వాసుపల్లి లాజర్, బండి జగన్‌మోహన్‌రావు, కంచర్ల శేషయ్య, పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో పారదర్శకంగా విచారణ జరపాలని పాస్టర్ డానియేల్ రాజ్ డిమాండ్ చేశారు.



క్రిస్టియన్‌పేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

తాడేపల్లి క్రిస్టియన్‌పేటలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ప్రవీణ్ మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్ మృతికి కారణాలను ప్రభుత్వం గుర్తించాలని, మృతికి గల కారకులకు కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జార్జి, మోషే, పాల్, స్త్రీల సమాజం యూత్, సంఘ పెద్దలు శానం ప్రభాకరరావు, వనమా మోషే, అన్నూరి వివేక్, మేడికొండ ఏసోబు, మదిర ఏసుబాబు, మన్నం బాబు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలు తగ్గించాలి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఉండవల్లి పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో రెండుసార్లుగా రూ.15,485 కోట్ల విద్యుత్ భారం వినియోగదారులపై భారం మోపిందని విమర్శించారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన విద్యుత్ నియంత్రణ మండలిని పాలకులు డమ్మీగా మార్చారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారులపై కొత్త భారాన్ని మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. మోసపూరిత కండిషన్లు పెట్టి, విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను అంటగట్టే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఈమని రామారావు, రాజధాని డివిజన్ నాయకులు బక్కిరెడ్డి, ఆర్‌వీ రాఘవయ్య, కె.రామకృష్ణ, పి.గాంధీ, సైకం వెంకటనారాయణ పాల్గొన్నారు.

సాయిబాబా సేవలో స్వామీజీ

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి శ్రీ సత్య షిర్డీ సాయిబాబాని అద్వైతానందగిరి స్వామీజీ ఆదివారం దర్శించుకున్నారు. స్వామీజీకి సాయిబాబా ఆలయ కమిటీ ఛైర్మన్, బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న గోశాలను దర్శించి, గోవులకు దాణా పెట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రాతూరి శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో టీడీపీకి భంగపాటు

మంగళగిరి: మంగళగిరి బార్ అసోషియేషన్‌కు జరిగిన ఎన్నికలలో టీడీపీ లీగల్ సెల్ నుంచి పోటీచేసిన అభ్యర్థులు ఓటమి చెందారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖంగుతిన్నారు. శనివారం అసోషియేషన్ ఎన్నికలు నిర్వహించగా టీడీపీ లీగల్ సెల్ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేసిన బ్రహ్మానందరావుతో పాటు పలువురు ఓటమి పాలయ్యారు. బ్రహ్మానందంపై లంకా శివరామ్‌ప్రసాద్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా లీగల్ సెల్ నుంచి పోటీ చేసిన బేతపూడి నాయుడమ్మ ఓటమి పాలవగా అతనిపై పోటీ చేసిన ప్రత్తిపాటి నవజీవన్ విజయం సాధించారు. టీడీపీ లీగల్ సెల్ నుంచి అధికారికంగా పోటీచేసిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇద్దరూ ఓటమి పాలవడంతో ఆ పార్టీ సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందే భారీగా ప్రచారం నిర్వహించి, మద్దతు పలికినా ఎందుకు ఓటమిపాలయ్యారని పార్టీ కార్యాలయం నాయకులు లీగల్ సెల్ నాయకులను నిలదీయడంతో ఏమి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు తెలిసింది. విజయం సాధించిన వారిలో అత్యధికంగా వైఎస్సార్ సీపీపై అభిమానం ఉన్న వారు కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది.

అలరించిన 'ఆనంద లహరి'



సాంస్కృతిక ప్రదర్శన దృశ్యం

తెనాలి: స్వచ్ఛంద సేవాసంస్థ మానవత ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన వినూత్నంగా 'ఆనంద లహరి'ని నిర్వహించారు. ఏఎస్ఎన్ కాలేజీ ఆవరణలోని కళావేదికపై కళా, సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. సభ్యులు కుటుంబాలతో హాజరయ్యారు. మృదంగ విద్వాంసుడు, కంచి కామకోటి ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో తొలుత శాస్త్రీయ సంగీత విభావరితో ఆరంభించారు. గాయనీమణి టి.శ్రీకాంతి గాత్రకచేరీ రంజింపజేసింది. ఆర్.వెంకటప్పయ్య వయొలిన్‌పై, కేవీ రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. 'గాన కళారత్న' వెంపటి సత్యనారాయణ సినీసంగీత విభావరి ప్రేక్షకుల కరతాళ ధ్వనులను అందుకుంది. వీటితోపాటు శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్యకళాకేంద్రం గురువు ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల దాండియా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, చైర్మన్ డాక్టర్ కె.రామ్‌చంద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, మల్లికార్జునరావు తదితరులు పర్యవేక్షించారు.

హనుమాన్ చాలీసా పారాయణ



పారాయణ చేస్తున్న భక్తులు

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం సత్రం కమిటీ చైర్మన్ నూకల వెంకట వేణుగోపాలరావు పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ములుకుట్ల విశ్వనాథ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. సత్రం కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, కమిటీ కార్యవర్గ సభ్యులు వుప్పల వరదరాజులు, గొడవర్తి సాయిహరే రామ్, నూకల భాస్కర్, గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నందివెలుగులో ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

తెనాలి టౌన్: త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో ఆదివారం ఇంటింటికీ త్రైత సిద్ధాంతం పరిచయ కార్యక్రమ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీవీ కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, బి.శివలింగం నాయక్, టి.బ్రాహ్మం, శ్రీను, రామోజీ నాయక్, హరిబాబు, సుబ్బారావు, ప్రకాష్, ఎస్‌కే దిల్‌షా, వి.మహాలక్ష్మి, వి.వంశీక, శ్రీలక్ష్మి, చంద్రగౌరి, తదితరులు పాల్గొన్నారు.


దేశ భక్తికి ప్రతీక ఆర్‌ఎస్‌ఎస్



మాట్లాడుతున్న జోనల్ సెక్రటరీ గోలి రామారావు

తెనాలి టౌన్: దేశభక్తి, క్రమశిక్షణకు ప్రతీకగా ఆర్‌ఎస్‌ఎస్ ఉంటుందని జోనల్ సెక్రటరీ గోలి రామారావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో 100 మంది స్వయం సేవక్‌లు రూట్ మార్చ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోలి రామారావు మాట్లాడారు. ప్రాంత కార్యదర్శి పి.ఆదిశేషయ్య, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి అంబటి మారుతీరావు, ఆర్‌ఎస్‌ఎస్ స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ ఆవ్వారు శ్రీనివాసరావు, స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

నేడు ఈద్ – ఉల్ – ఫితర్



పాత బస్టాండ్ వద్ద విద్యుద్దీపాలంకరణలో మసీదు

- ఉపవాస దీక్షలు విరమించిన ముస్లింలు
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలు సిద్ధం

మంగళగిరి టౌన్ / తాడేపల్లి రూరల్ : నెలవంక దర్శనంతో నెల రోజుల కఠోర ఉపవాస దీక్షలను ముస్లింలు ఆదివారం ఇఫ్తార్‌తో ముగించారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం సాయంత్రమే పండుగ సామగ్రి కొనుగోళ్లతో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లోని దుకాణాలు కిటకిటలాడాయి. మానవాళి సంక్షేమం కోసం మహమ్మద్ ప్రవక్త ద్వారా పవిత్ర ఖురాన్ ఆవిష్కారమైన రంజాన్ మాసం ఈద్ – ఉల్ – ఫితర్ రాకతో ఘనంగా ముగిసింది. భగవంతుని దృష్టిలో పేద, ధనిక వ్యత్యాసం లేదని, అందరూ సమానమేనని నిరూపించిన ఉపవాస దీక్షలను ఇఫ్తార్‌తో ముస్లింలు ముగించారు. 30 రోజులుగా స్నేహానికి, ఆప్యాయతలకు ప్రాధ్యామిస్తూ కులమతాలకు అతీతంగా సర్వమత సహనంతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. నెలవంక కనిపించడంతో మసీదు పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నెలవంకను చూసిన అనంతరం ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు చేసి దువా పఠించారు. మంగళగిరి నగర పరిధిలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న మసీదు, పాత మంగళగిరి కల్యాణ మండపం వద ఉన్న మక్కా మసీదు, తాడేపల్లిలోని జామియా మసీద్, ముగ్గ రోడ్డులోని నూరాని మసీదు, పోలకంపాడులోని మసీదు ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. మసీదులు విద్యుద్దీపాలంకరనలో కాంతులీనాయి.



ముగ్గురోడ్డులోని నూరాని మసీదు



పాత మంగళగిరిలోని మక్కా మసీదు